క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్, ఎన్జీవోస్ కాలనీ, టీవీ టవర్, వెంకటేశ్వర కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, కేయూసీ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, వెస్ట్ సిటీ సబ్ స్టేషన్, టేకులగూడెం సబ్‌స్టేషన్, రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిమల కాలనీ ఫీడర్, రజక సంఘం, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్, మైత్రినగర్ ప్రాంతాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు.

నరేందర్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధకుడు ముద్దెపాక నరేందర్‌కు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. పొలిటికల్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ దళిత్ ఉమెన్ ఇన్ పంచాయతీరాజ్ ఇన్‌స్టిట్యూషన్స్ – ఏ స్టడీ ఇన్ నల్గొండ డిస్ట్రిక్ట్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి నరేందర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ సీహెచ్.దినేష్‌కుమార్ పర్యవేక్షణలో నరేందర్ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

ఉపాధి పని ప్రదేశాల్లో సదుపాయాలు కల్పించాలి

వరంగల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈక్రమంలో పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలో బూరుగు వెంకటమ్మ అనే గిరిజన కూలీ.. ఉపాధి పనిచేస్తున్న క్రమంలో వడదెబ్బకు గురై ఇటీవల మరణించడం బాధాకరమని పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీటి సౌకర్యం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని ఆయన సూచించారు.

ప్రత్యేక అలంకరణలో అంజన్న



కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలోని దక్షిణ ముఖ అభయాంజనేయస్వామికి అర్చకులు ప్రత్యేక అలంకరణ పూజలు జరిపించారు. ఆలయ ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఆంజనేయస్వామికి భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 50మందికి మాలలు వేసి మండల దీక్షలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు గురుస్వాములు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



వరంగల్: అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా వరంగల్ పోచమ్మ మైదాన్‌లోని జకోటియా కాంప్లెక్స్‌లోని వ్యాపారులకు అగ్ని ప్రమాదాలు – నివారణ చర్యలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఇటీవల ఆ కాంప్లెక్స్‌లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి వివరించారు. కార్యక్రమంలో వరంగల్ ఇన్‌చార్జ్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ బి.రవీందర్, ఎల్ఎఫ్ గణేష్, టి.గంగాధర్, ఎండి.నబీ, కె.రవి, బి.గిరిబాబు పాల్గొన్నారు.

చీకటిలో ఎన్జీఓస్ కాలనీ

- వారం రోజులుగా వెలుగని వీధి దీపాలు



హన్మకొండ: హనుమకొండలోని ఎన్జీఓస్ కాలనీ వారం రోజులుగా చీకటిలో మగ్గుతోంది. వీధి దీపాలు వెలుగకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చీకటిలోనే ప్రయాణాలతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీధి దీపాలు వెలుగకున్నా వరంగల్ మహానగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

వారు నివేదించారు.. వీరు తలూపారు

- గంటలోపే ముగిసిన మండల సర్వసభ్య సమావేశం
- తూతూమంత్రంగా సాగిన వైనం
- చివరి సమావేశంలో పలువురు ఎంపీటీసీలు, అధికారుల గైర్హాజరు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. ఎలాంటి ప్రశ్నోత్తరాలు లేకుండానే గంటలోపే సమావేశం ముగిసింది. మరో రెండు నెలలు అయితే ఎంపీటీసీల పదవీ కాలం పూర్తవుతుంది. ఎంపీటీసీలకు ఇది చివరి సమావేశం. హసన్‌పర్తి మండలంలో మొత్తం ఎనిమిది మంది ఎంపీటీసీలుండగా వారిలో ఎంపీపీతో సహా నలుగురు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. మహిళా ఎంపీటీసీ సభ్యులు హాజరుకాగా, పురుష ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు.



నివేదికను చదివి వినిపిస్తున్న ఏఓ అనురాధ

సమస్యలపై చర్చే లేదు

సమావేశం సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు చెందిన నివేదిను నివేదిస్తుండగా, హాజరైన ఎంపీటీసీలు మాత్రం ఎలాంటి సమస్యలను లేవనెత్తకుండానే ఓకే అంటూ తల ఊపారు. ప్రస్తుత వేసవిలో ఆయా గ్రామాల్లో నీటిఎద్దడి తీవ్రంగా ఉన్నప్పటికీ ఎంపీటీసీలు స్పందించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గంటలోపే ముగిసిన సమావేశం

గంటలోపే సమావేశం ముగిసింది. ఉదయం 11గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా, ఎంపీపీతో పాటు మరో ఎంపీటీసీ మాత్రమే మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. కోరం లేనందున ఫోన్ చేసి మరో ఇద్దరు ఎంపీటీసీలను పిలిచారు. దాంతో ఉదయం 11.45 గంటలకు సమావేశం ప్రారంభమైంది. మొత్తం 18శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన నివేదికను నివేదించాల్సి ఉండగా, ఎనిమిది శాఖలకు సంబంధించిన అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. కొంతమంది స్పెషల్ ఆఫీసర్లు కూడా సమావేశానికి హాజరు కాలేదు. సమావేశానికి హాజరైన పది శాఖల అధికారులు అలా వచ్చి.. ఇలా నివేదించి వెళ్లారు. ఎంపీపీ కేతపాక సునీత అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు రేనుకుంట్ల సునీత తదితరులు పాల్గొన్నారు.

బహుజన కమ్యూనిస్టు నాయకుడు గౌస్

వరంగల్ చౌరస్తా: బహుజన కమ్యూనిస్టు నాయకుడు, అమరజీవి మహమ్మద్ గౌస్ అని, ఆయన ఆశయ సాధనకు ముందుకు సాగాలని ఎంసీపీఐ (యూ) కేంద్ర కమిటీ సభ్యులు గోనె కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ సూచించారు. ఎంసీపీఐ (యూ) జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ మృతి చెందిన మహమ్మద్ గౌస్ తృతీయ వర్ధంతిని వరంగల్ అండర్ బ్రిడ్జికి సమీపంలోని ఓంకార్ భవన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మనిషి పుట్టడం చనిపోవడం, సహజమే అయినప్పటికీ కష్టజీవులు, సమ సమాజ స్థాపన కోసం నమ్ముకున్న సిద్ధాంత బాటలో పయనించడం కొంతమందికే సాధ్యమని వివరించారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

అలాంటి గొప్పవ్యక్తి మహమ్మద్ గౌస్ కొనియాడారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్, నాయకులు నర్ర ప్రతాప్, మంద రవి, కుసుంబ బాబురావు, కందికొండ కుమారస్వామి, ఎండీ.ఇస్మాయిల్, ఐతం నాగేష్, జన్ను రమేష్, మాలి ప్రభాకర్, అప్పనపురి నర్సయ్య, రాయినేని ఐలయ్య, జటబోయిన నర్సయ్య, ఉడత గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

మడికొండ: చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని సఖి సెంటర్ కేసు వర్కర్ హరిత అన్నారు. మడికొండలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో సఖి ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే, సఖి సెంటర్ అందించే సేవలను వివరించారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి కేంద్రం నిర్వహిస్తున్నట్లు వివరించారు. బాధిత మహిళలు, బాలికలకు కౌన్సెలింగ్, వైద్య, న్యాయ, పోలీసు సహాయం, తాత్కాలిక వసతి అందించనున్నట్లు తెలిపారు. గృహ హింస, లైంగిక వేధింపులు, పనిచేసే చోట వేధింపులు, అత్యాచార బాధితులకు సఖి కేంద్రం అండగా ఉంటుందని చెప్పారు. 181 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి తక్షణ సహాయం పొందాలని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న హరిత

ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌కు సన్మానం



మామునూరు: 2021లో జరిగిన హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు శిక్షపడేలా కృషి చేసిన అప్పటి మడికొండ సీఐ, నేటి మామునూరు ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌ను బాధిత కుటుంబ సభ్యులు కృష్ణ, దివ్య శుక్రవారం సన్మానించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వనం రెడ్డి, శుణ్ముఖరెడ్డి, కోటి తదితరులు పాల్గొన్నారు.

'ఆర్‌జేడీ' తరలింపుపై హర్షం



కేయూ క్యాంపస్: గతంలో హనుమకొండలో ఇంటర్ విద్య ఆర్‌జేడీ కార్యాలయం కొనసాగి, ఆ తర్వాత హైదరాబాద్‌లోని ఇంటర్ విద్య కమిషనర్ కార్యాలయానికి తరలించి, తిరిగి మళ్లీ హనుమకొండకు తరలించడంపై విద్యార్థి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఏబీఎస్ఎఫ్ సమావేశంలో జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ మాట్లాడారు. గత కొంతకాలంగా స్థానికంగా ఆర్‌జేడీ కార్యాలయం లేకపోవడంతో అనేక ఇబ్బందులు తలెత్తాయని అన్నారు. మళ్లీ హనుమకొండలోనే ఆర్‌జేడీ కార్యాలయం కొనసాగించేందుకు ఉత్తర్వులు ఇచ్చిన ఉన్నత విద్యాశాఖ సెక్రటరీ బుర్ర వెంకటేశానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ప్రశాంత్, వినయ్, శ్రీకాంత్, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

మనువాదాన్ని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడుకుందాం



అభివాదం చేస్తున్న నాయకులు

కాజీపేట అర్బన్: మనిషిని మనిషిగా చూడని మనువాదాన్ని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడుకుందామని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. భారత రాజ్యాంగ పరిరక్షణపై హంటర్ రోడ్డు న్యూశాయంపేటలో డీబీఎఫ్, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ పూలే, అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ జయంతి మహోత్సవాల సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చుంచు రాజేందర్, ఏఐఏవైఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తరాల సందీప్, వీసీకే రాష్ట్ర అధ్యక్షుడు జిలుకర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఓనర్ల సమస్యలు పరిష్కరించాలి



పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రతినిధులు

వరంగల్: తమ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని ఆయన స్వగృహం అర్పణపల్లిలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత లారీలకు ఫిట్‌నెస్ రెన్యూవల్ ఫీజు రూ.వేయి ఉండగా ప్రభుత్వం రూ.13,700లకు పెంచిందని, దీనిపై కోర్టు స్టే ఇచ్చినప్పటికి అధికారులు అమలు చేయడం లేదని తెలిపారు. ఇసుక క్వారీల్లో లోడింగ్ సమయాల్లో ఎదురవుతున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. బిల్లులు లేకుండా పెద్దపల్లి, కరీంనగర్‌తో ఇతర జిల్లాల్లోని అధికారిక క్వారీల నుంచి, అదేవిధంగా నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి మళ్లీ అక్రమ ఇసుక రవాణా వస్తోందని ఫిర్యాదు చేశారు. కొన్ని ప్రాంతాల్లో ఫిల్టర్ ఇసుక తయారీ చేస్తున్న విషయాన్ని ఆయ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మంచిరెడ్డి రాజేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వేముల భూపాల్, కోశాధికారి ఎండీ.జాకీర్, నారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చేయూత

కాజీపేట రూరల్: కాజీపేట దర్గా ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థి, దర్గా వాసి, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వలపదాసు చంద్రశేఖర్ చేయూతనందించారు. దర్గా పాఠశాల మీటింగ్ హాల్ పునరుద్ధరణకు రూ.లక్ష పైచిలుకు విరాళం అందజేసి అభివృద్ధి పనులకు సహకరించారు. ఈమేరకు దర్గా ప్రభుత్వ పాఠశాలలోని మీటింగ్ హాల్‌ను దాత డాక్టర్ చంద్రశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనను హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు సన్మానించారు. పాఠశాల సెక్రటరీ కె.శ్రీనివాస్, ఉపాధ్యాయులు టి.సంతోష్‌కుమారి, ఎం.సుమలత, బి.సతీష్‌పాల్, బి.సునీత, ఎ.మహేష్, అంబ ప్రసాద్, రామ్మోహన్, వరలక్ష్మి పాల్గొన్నారు.



మీటింగ్‌హాల్‌ను ప్రారంభిస్తున్న చంద్రశేఖర్

సుధాకర్‌కు జీవిత సాఫల్య పురస్కారం



పురస్కారం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

హన్మకొండ అర్బన్: డాక్టర్ అప్పాల సుధాకర్‌కు శ్రీభువనేశ్వరి మాత చారిటబుల్ ట్రస్టు ద్వారా జీవిత సాఫల్య పురస్కారాన్ని అందించారు. నగరంలోని ఏషియన్ మాల్ సమీపంలోని సాయిబాబా దేవాలయ కల్యాణ మండపంలో ట్రస్ట్ పురస్కారాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌కు జీవన సాఫల్య పురస్కారంతో పాటు డీఎంహెచ్ఓ సాంబశివరావు, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్, యోగా గురువు రమేష్, న్యాయవాది సునీత, టీల్యాబ్ మేనేజర్ కౌముది, వేముల అశోక్‌రెడ్డి, డాక్టర్ వెంకన్నకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. వివిధ రంగాల్లో విశేష సేవలందించిన పలువురు మహిళలకు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ మోత్కూరి రాము, ప్రధాన కార్యదర్శి పద్మజ, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

మహిళా, కిసాన్ మోర్చా కమిటీల ఎన్నిక

హన్మకొండ: భారతీయ జనతా పార్టీ అనుబంధ మహిళా మోర్చా పూర్తిస్థాయి జిల్లా కమిటీని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రత్న లక్ష్మి ప్రకటించారు. మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా సిరికొండ కవిత, నూకల ఉషారెడ్డి, సింగిరెడ్డి రమ, మేకల కోమల, తడకమల్ల వాణి, ప్రధాన కార్యదర్శులుగా మునిగాల పద్మ, రజినీ, కార్యదర్శులుగా పి.అనిత, కనకలక్ష్మి, సిరికొండ సుజాత, పి.స్వప్న, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విశ్వనాథ్ శ్రీదేవిని నియమించినట్లు వివరించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్ అధ్యక్షులను కూడా నియమించినట్లు వెల్లడించారు. 40వ డివిజన్ అధ్యక్షురాలిగా పాక ఉష, గంగాదేవి (5వ డివిజన్), రామారపు మంజుల (6), రజిత (7), ఎస్.కవిత (9), నాసం కరుణ (10), నదియా (11), పిట్టల ధనలక్ష్మి (31), నాయిని శైలజ (45), రాణి (47), వాణి (51), జిల్లపల్లి కవిత (52), పాకాల పద్మ (57), సుజాత (65), మమత 66వ డివిజన్ అధ్యక్షురాలిగా నియమించినట్లు ప్రకటించారు. బీజేపీ అనుబంధ కిసాన్ మోర్చా హనుమకొండ జిల్లా కమిటీని రావు పద్మ, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గండు సారయ్య ప్రకటించారు. కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా రాజమౌళి, రవీందర్ రెడ్డి, రాజ్‌కుమార్, రాజు, మధుకర్, రాజేష్, దుస్స రాములు, ప్రధాన కార్యదర్శులుగా రవీందర్ యాదవ్, అమృత్ రావు, కోటేశ్వర్, కార్యదర్శులుగా రవీందర్ రెడ్డి, బోళ్ల అకూస్, ఆకుల రాంబాబు, కనుగుల నాగరాజు, బి.కనకచారి, కటకం రాజేష్, బొగ్గని రాజేంద్ర ప్రసాద్, కోశాధికారిగా బిట్ల లింగయ్య, అధికార ప్రతినిధులుగా పెద్ది కిషన్‌రెడ్డి, వేల్పుల శ్రీధర్‌ను నియమించినట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు. కార్యవర్గ సభ్యులుగా భిక్షపతి, మెట్టు అశోక్ రావు, సురేందర్, సురేష్, భగవాన్ రెడ్డి, బోడ పట్ల కుమార్, మునిగంటి సమ్మిరెడ్డి, గండి స్వామి, పొల్లంపెల్లి సదానందం, మునుకు కృష్ణ, బుర్ర రాజన్‌బాబు, ఎల్.సందీప్, ఎం.మధుసూదన్ రెడ్డి, ఆకుల రాజేందర్, ఆడెపు వెంకన్న, సంగెం రామకృష్ణ, కొయ్యడ రమేష్, ఎం.బాబురావు, ఎం.రమేష్, జి.ప్రశాంత్, వంగ రమేష్‌ను నియమించారు.

క్రైం కార్నర్

ఆఫీసర్స్ క్లబ్‌లో వర్కర్ ఆత్మహత్య

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో పనిచేస్తున్న వర్కర్ గట్టికొప్పుల శ్రీనివాస్ (42) గురువారం రాత్రి క్లబ్‌లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. సభ్యత్వం రుసుంలో తనకు రావాల్సిన రూ.10 లక్షలు రాకపోవడంతో బలవన్మరణానికి పాల్పడ్డాడని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైలుకింద పడి యువకుడు..

కాజీపేట రూరల్: కాజీపేట – పెండ్యాల్ రైల్వే స్టేషన్ల మధ్య గల అయోధ్యపురం రైల్వే గేట్ సమీపంలో ఒక యువకుడు రైలు కిందపడి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కాజీపేట జీఆర్పీ ఎస్సై మొహినొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం ఐనవోలు మండలం సింగారం గ్రామానికి చెందిన దోపతి కార్తీక్‌రెడ్డి (24) వ్యాపారాలు చేస్తూ అందులో నష్టం రావడంతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్ఆర్‌నగర్‌లో ఒకరు..

వరంగల్: 14వ డివిజన్ ఎస్ఆర్‌నగర్‌కు చెందిన మార్త ఓంప్రకాష్ అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం బలవన్మరణానికి పాల్పడ్డట్లు ఏనుమాముల పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనాన్స్ వ్యాపారంలో నష్టం రావడంతో ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో గురువారం రాత్రి ఉరి వేసుకోగా, భార్య వాణి, కూతురు చరణి.. చుట్టుపక్కల వారి సహాయంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పినట్లు వివరించారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసును ఎస్సై పోగుల శ్రీకాత్ దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

వాహనాల చోరీ నిందితుడి అరెస్టు

రామన్నపేట: నగరంలో పార్కింగ్ చేసి ఉన్న వాహనాల అపహరణకు పాల్పడుతున్న నిందితుడిని ఇంతేజార్‌గంజ్ పోలీసులు అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు. అతడి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామానికి చెందిన షేక్ ఇమ్మాన్ మద్యానికి బానిస కావడంతో భార్య.. పిల్లలతో కలిసి అతడిని వదిలిపెట్టి తల్లిగారింటికి వెళ్లింది. దాంతో ఇమ్రాన్ జల్సాలు, తాగుడుకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందుతుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఇన్‌స్పెక్టర్ ఎం.శివకుమార్, ఎస్సై వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ రవీందర్‌రెడ్డి, భిక్షపతి, క్రైమ్ కానిస్టేబుల్ శివకుమార్, ఉపేందర్, రాజశేఖర్‌ను ఏసీపీ అభినందించారు.

గుండెపోటుతో ఒకరి మృతి

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుర్జిత్‌నగర్‌లో మునగాల అనిల్‌కుమార్ (35) గుండెపోటుతో మృతి చెందినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. అనిల్‌కుమార్ గురువారం రాత్రి ఛాతిలో నొప్పి వస్తోందని బాధపడడంతో ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారని వివరించారు. మృతుడి భార్య మునగాల లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జువైనల్ హోమ్‌కు 14మంది బాలురు

కాజీపేట: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతూ తనిఖీల్లో పట్టుబడిన 14మంది బాలురను జువైనల్ కోర్టులో హాజరుపర్చగా ఒక రోజు బాలల పరిశీలన కేంద్రానికి పంపిస్తూ మెజిస్ట్రేట్ శుక్రవారం తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.నాగబాబు తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సీపీ అంబర్ కిశోర్‌ఝా ఆదేశాల మేరకు పట్టణంలో తనిఖీల్లో వాహనాలు నడుపుతున్న బాలురను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

సంక్షిప్తంగా

పార్కులో ఆకతాయిల వీరంగం

కాశిబుగ్గ: 19వ డివిజన్ కాశిబుగ్గ సిద్దయ్య హోటల్ సమీపంలోని పార్కులో కొంతమంది ఆకతాయిలు మద్యం సేవిస్తూ, సిగరెట్లు తాగుతూ వీరంగం సృష్టించిన వీడియో వాట్సాప్‌లో శుక్రవారం వైరలైంది. ఇదేమిటని ప్రశ్నిస్తే చంపుతామంటూ బెదిరింపులకు దిగారని స్థానికులు వాపోతున్నారు. ఇలాంటి ఘటనలు పార్కులో తరుచు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని చెప్పారు. పోలీసులు నిఘాపెట్టి అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నరేంద్రమోదీకి అండగా నిలవాలి

కాజీపేట: బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి పీఎం నరేంద్రమోదీకి ప్రజలు అండగా నిలవాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర నర్సింగ్‌గౌడ్ అన్నారు. పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని కోరుతూ కాజీపేట మండలం సోమిడి గ్రామంలో శుక్రవారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దర్గా కాజీపేట సహకార సంఘం డైరెక్టర్ కాయిత రాజ్‌కుమార్ యాదవ్, నాయకులు మేకల శ్రావణ్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ మరోసారి ప్రధాని కావాలి



కాశిబుగ్గ: నరేంద్ర మోదీ మరోసారి ప్రధాని కావాలని, అందుకోసం బీజేపీ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కసుకుంట్ల రంజిత్ కోరారు. అబ్బనికుంటలో శుక్రవారం ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంజిత్ మాట్లాడుతూ బీజేపీతోనే దేశం సుస్థిరంగా ఉంటుందని చెప్పారు. ప్రచారంలో నాయకులు తమ్మిశెట్టి క్రాంతి, బొంత సంతోష్, అరుకుల నాగరాజు పాల్గొన్నారు.

రమేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

ఖిలా వరంగల్: బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వరంగల్ 33 డివిజన్ నాయకులు కోరారు. ఈమేరకు నాంద్రే అమర్‌నాథ్ ఆధ్వర్యంలో ముత్తినేని శ్రీనివాస్, రాజేష్ ఉపాధ్యాయ, ముద్దసాని కృష్ణ 37వ డివిజన్ తూర్పుకోటలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఓబీసీ మోర్చాల జిల్లా అధ్యక్షుడు, జోనల్ ఇన్‌చార్జ్ మంద శ్రీనివాస్ హాజరై ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మూడోసారి నరేంద్ర మోదీని ప్రధానిగా చూడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు జిలకర వీరస్వామి, నాగులు ప్రసాద్, ఓదెలు, తిప్పని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు వెళ్లి ఓట్లు అడగాలి



హసన్‌పర్తి: పార్టీ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య గెలుపునకు గడపగడపకు వెళ్లి ఓట్లు అడగాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు పిలుపునిచ్చారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు సందెల చిన్న ఆధ్వర్యంలో చుంచు రవిందర్, పోలపల్లి కుమార్, వెన్నపురెడ్డి బుచ్చిరెడ్డి, శ్రీపతి కుమార్, జనగాని శ్రీనివాస్ శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కడియం కావ్యను అధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దూడయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రను విజయవంతం చేయాలి

ఖిలా వరంగల్: సభ్యుల ఉల్లాసం కోసం చేపడుతున్న విదేశీ విహార యాత్రను విజయవంతం చేయాలని అన్నపూర్ణ పరపతి సంఘం అధ్యక్షుడు బిట్ల సుధాకర్, ప్రధాన కార్యదర్శి బండి కోటేశ్వర్ రావు పిలుపునిచ్చారు. వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఏకశిల నగర్‌లోని అన్నపూర్ణ పరపతి సంఘం భవనంలోని కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన సమావేశంలో సంఘ కార్యవర్గ సభ్యులతో కలిసి బ్యాంకాక్ యాత్ర కరపత్రాలను ఆవిష్కరించి వారు మాట్లాడారు. రెండేళ్లకోసారి సంఘం ద్వారా స్వదేశీ, విదేశీ విహార యాత్రలు చేపడుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఈ ఏడాది బ్యాంకాక్, పట్టాయా (థాయ్‌లాండ్) విదేశీ విహార యాత్రకు వెళ్లాలని నిర్ణయించినట్లు వివరించారు. కార్యక్రమంలో కార్యవర్గ ప్రతినిధులు వలుప రాజమల్లు, ఝినబోతుల సాంబయ్య, మాచన శ్రీధర్, బత్తిని వీరభద్రయ్య, పెంచాల నర్సయ్య, అనుమాస సారయ్య, ఈటూరు కొండల్‌రావు, బైరబోయిన దామోదర్, రఘువీర్, దామరకొండ వెంకటేశ్వర్లు, విలాసాగరం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం, ధూమపానంతో కాలేయ వ్యాధులు



హన్మకొండ చౌరస్తా: మద్యపానం, ధూమపానం లాంటి చెడు అలవాట్లతో కాలేయ సంబంధిత వ్యాధులు వస్తాయని డాక్టర్ కూరపాటి రమేష్ అన్నారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా 'లివర్ పనితీరు – వ్యాధుల తీవ్రత' అనే అంశంపై రూపొందించిన వాల్‌పోస్టర్లను హనుమకొండలోని కూరపాటి ఆస్పత్రిలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు అన్ని వయస్సుల వారు మద్యానికి బానిసయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో డీఅడిక్షన్ సపోర్ట్ గ్రూప్ ఏర్పాటు చేసి సంబంధిత కుటుంబ సభ్యులకు సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

సీఎం సభా ప్రాంగణం పరిశీలన



మడికొండ: ఈనెల 24వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా మడికొండలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈక్రమంలో మడికొండలోని సభ ప్రాంగణాన్ని పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కర్సన్ నాగరాజు, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తదితరులు శుక్రవారం సందర్శించారు. హెలీపాడ్ స్థలం, సభ ప్రాంగణం, సభకు వచ్చే వాహనాల పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. కళాకారులకు ప్రత్యేక స్టేజీ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఆనంద్, నాయకులు నవీన్, క్రాంతి పాల్గొన్నారు.